'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# ట్రంప్‌పై హత్యాయత్నం

**అగ్రరాజ్యం** అమెరికాలో ఎన్నికల సందడి మధ్యలో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం జరగడంతో ప్రపంచం ఒక్కసారిగా ఉలికిపాటుకు గురైంది. ఆయన అచ్చంగా వెంట్రుకవాసిలో మృత్యువును తప్పించుకోవడంతో అంతా హమ్మయ్యా అని ఊపిరి పీల్చుకున్నారు. ప్రజాస్వామిక దేశమైన అమెరికాలో పరాకాష్ఠకు చేరిన హింసా సంస్కృతికి ఇది అద్దం పడుతున్నది. సాయుధ అంగరక్షకుల తక్షణ ప్రతిస్పందనతో ట్రంప్ సురక్షితంగా బయటపడ్డప్పటికీ, నిఘా, భద్రతా ఏర్పాట్ల వైఫల్యం విమర్శలకు గురవుతున్నది. సాయుధ ఆగంతకుడు ఒక మాజీ అధ్యక్షునికి అంత సమీపంలోకి ఎలా రాగలిగాడన్నది ప్రశ్న. ఈ హత్యాయత్నం వెనుక ఉన్న వ్యక్తులెవరో, వారి కుట్రలేమిటో ఇంతవరకైతే పెద్దగా తెలియరాలేదు. సాధారణంగా ఇలాంటి ఘటనలపై ఊహాపోహలు, కుట్రకథనాలు వెల్లువెత్తుతాయి. మాజీ అధ్యక్షుడు కెనెడీ హత్యోదంతం నిగూఢంగానే ఉండిపోవడం తెలిసిందే. ఇప్పుడీ ఘటన కూడా అలాగే మిగిలిపోవచ్చు. దాడికి తెగబడ్డ యువకుడిని భద్రతాధికారులు మట్టుపెట్టిన కారణంగా అసలు రహస్యం ఎప్పటికైనా బయటకు వస్తుందా? అనేది సందేహాస్పదమవుతున్నది.

దాడి ఘటన ఎన్నికల్లో రాజకీయ వేడి రాజేస్తున్నది. ఒకరకంగా చెప్పాలంటే మొత్తంగా ఎన్నికల ప్రచార సరళిని అది రాత్రికి రాత్రే తారుమారు చేసింది. సహజంగానే అధ్యక్ష ఎన్నికల్లో అదొక నిర్ణాయక అంశంగా మారుతున్నట్టు స్పష్టమవుతున్నది. చెవిపైన, ముఖంపైన రక్తం చారికలతో కూడిన డొనాల్డ్ ట్రంప్ ఫొటోలను రిపబ్లికన్ పార్టీ ప్రచారాస్త్రాలుగా చేసుకుంటున్నది. అధ్యక్షుడు బైడెన్ తన రిపబ్లికన్ ప్రత్యర్థిపై చేసిన తీవ్ర విమర్శల ఫలితంగానే హత్యాయత్నం జరిగినట్టు రిపబ్లికన్ నేతలు ఆరోపించడమే ఇందుకు నిదర్శనం. ట్రంప్ మళ్లీ గెలిస్తే ప్రమాదమనీ, ఆయన ఓ నియంతగా మారి అమెరికా జీవనవిధానాన్ని దెబ్బ తీస్తారని జో బైడెన్ చేసిన హెచ్చరికలను ఈ సందర్భంగా వారు ఉదహరిస్తుండటం గమనార్హం. ముఖ్యంగా ట్రంప్‌పై 'గురి'పెట్టాలని, ఆయనను 'లక్ష్యం'గా చేసుకోవాలని ఇచ్చిన పిలుపును ఎత్తిచూపుతున్నారు. బైడెన్ యాదృచ్ఛికంగానే ఆ వ్యాఖ్యలు చేసినప్పటికీ ఇప్పుడు వాటినే ఎదురుదాడికి ఉపయోగించుకుంటున్నారు.

2020 అధ్యక్ష ఎన్నికల్లో పరాజయాన్ని అంగీకరించకుండా తన మద్దతుదారులతో కాంగ్రెస్ భవనంపై దాడి జరిపించారన్న ఆరోపణలు ట్రంప్‌ను వెంటాడుతూనే ఉన్నాయి. ఆ దాడి ఫలితంగా ఆయన కాంగ్రెస్ అభిశంసనకు గురవడమే కాకుండా, అనేక కేసులను కూడా ఎదుర్కొంటున్నారు. ఇలా ఎన్నో అవాంతరాలు ఎదురైనప్పటికీ ఆయన మరోసారి రిపబ్లికన్ అభ్యర్థిగా నామినేషన్ పొందడమే కాకుండా అధ్యక్షుడు బైడెన్‌కు గట్టి పోటీ ఇస్తుండటం విశేషం. అటు ప్రచారంలో వెనుకబడినట్టుగా భావిస్తున్న అధ్యక్షుడు బైడెన్ విజయావకాశాలను దాడి ఘటన తీవ్రంగా తీస్తే, ఇటు స్వల్ప ఆధిక్యతలో ఉన్న ట్రంప్‌కు సానుకూలత భారీగా పెరిగినట్టు వార్తలు వస్తున్నాయి. అంతిమంగా గెలుపోటములు ప్రజల చేతుల్లో ఉంటాయి. పెన్సిల్వేనియాలో జరిగిన దాడి ప్రస్తుత ఎన్నికలపై మాత్రమే కాకుండా దీర్ఘకాలికంగా అమెరికాపై ప్రభావం వేస్తుందని చెప్పవచ్చు.



పిన్నింటి విజయ్‌కుమార్
90520 39109

# రైతులపై ఎరువుల భారం!

**2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని 2016 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. రెట్టింపు సంగతి పక్కనపెడితే పలు రాష్ర్టాల రైతుల ఆదాయం గణనీయంగా తగ్గినట్టు స్టాండింగ్ కమిటీ నివేదిక సమర్పించింది. మార్చి 2022లో విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం... 2015-16, 2018-19 మధ్య కొన్ని రాష్ర్టాల్లో రైతుల ఆదాయం పడిపోయింది. జార్ఖండ్‌లో రైతుల ఆదాయం నెలకు రూ.7,068 నుంచి రూ.4,895కి, నాగాలాండ్‌లో రూ.11,428 నుంచి రూ.9.877కి, ఒడిశాలో రూ.5,274 నుంచి రూ.5,112కి తగ్గాయి. ఆదాయం రెట్టింపు ముచ్చట దేవుడెరుగు కానీ రైతుల పెట్టుబడి వ్యయాన్ని రెట్టింపు చేసిందనేది ప్రభుత్వ వ్యవసాయ విధానాలను పరిశీలిస్తే మనకు అవగతమవుతుంది.**

వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి రైతులను తమ పొలాల్లోనే కూలీలుగా మార్చే కేంద్ర ప్రభుత్వ వైఖరి సుస్పష్టంగా మన కండ్లముందున్నది. సబ్సిడీలతో, రుణమాఫీలతో కార్పొరేట్ వ్యవస్థకు వంతపాడుతూ.. దేశానికి వెన్నెముకై నిలిచిన రైతులపై ఎరువుల భారం వేస్తూ వెన్నుపోటు పొడుస్తున్నది. 'రైతు పండించిన పంటలకు కల్పించే మద్దతు ధరకు, ఎరువుల ధరకు పొంతన లేకుండానే 2022లో ఎరువుల ధరలు 50 శాతం పెంచి రైతాంగాన్ని ఒక్కసారిగా అగాధంలోకి నెట్టింది. దీనిని కుంటిసాకుగా చూపి అంతర్జాతీయ మార్కెట్లో ఎరువుల ముడిసరుకు ధరలు పెరిగినట్టు చెప్తున్నది. ముడిసరుకు ధరలు పెరిగితే వాటిని భరించాల్సిన కేంద్రం ఆ భారాన్ని రైతులపై మోపుతూ వారి నడ్డిని విరుస్తున్నది. ఇదిలా ఉంటే రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రగల్భాల పలకడం చూస్తుంటే 'హత్య చేసినోడే హంతకుడి కోసం వెతికినట్టు ఉన్నదని' రైతులు వాపోతున్నారు.

గడిచిన పదేండ్లలో కేంద్రం గుడ్డిగా ఎరువుల ధరలను పెంచుతూ యూరియా, డీఏపీ వినియోగాన్ని తగ్గించేలా ప్రచారం చేయాలని రాష్ర్టాలకు చెప్తున్నది. రైతులు ఎక్కువగా వాడే 28.28.0 ఎరువు ధరను 50 శాతం, పొటాష్ ధరను 100 శాతానికి పైగా 2021 ఏడాది చివరలో 90 రోజుల్లోనే



పెంచడం శోచనీయం. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఎంవోపీ, కాంప్లెక్స్ ఎరువుల ధరలను దేశంలో రైతులు ఎక్కువగా పండించే వరి, పత్తి పంటలకు మద్దతు ధరలను ఏ విధంగా పొంతన లేకుండా నిర్ణయించిందనేది ఒకసారి పరిశీలిద్దాం...

**1. ఎరువుల ధరలు: (50 కిలోల బస్తాలు) 2. వరికి కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర (రూపాయలలో)
3. పత్తి పంటకు కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర(రూపాయలలో)**

| ఏడాది | కాంప్లెక్స్‌లు (రూ.లలో) | వరి సాధారణ రకం - ఏ గ్రేడ్ రకం | పత్తి పంటకు కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర |
|---|---|---|---|
| 2014-15 | 890-1210 | 1360-1400 | 3750-4050 |
| 2015-16 | 890-1210 | 1410-1450 | 3800-4100 |
| 2016-17 | 890-1197 | 1470-1510 | 3860-4160 |
| 2017-18 | 900-1225 | 1550-1590 | 4020-4320 |
| 2018-19 | 1040-1425 | 1750-1770 | 5150-5 |
| 2019-20 | 950-1425 | 1815-1835 | 5235-5550 |
| 2020-21 | 975-1275 | 1815-1835 | 5515-5825 |
| 2021-22 | 12-1395 (కొన్నిటికి 1900 రూపాయలు) | 1940-1960 | 5726-6025 |
| 2022-23 | 1350-1400 | 2040-2060 | 6080-6380 |
| 2023-24 | 1450-1200 (కేవలం 20-20-13కు మాత్రమే) | 2183-2203 | 6620-7020 |
| 2024-25 | 1700-1900 | 2300-2320 | 7121-7521 |

ఈ విధంగా కేంద్ర ప్రభుత్వం పొంతన లేని ఎరువుల ధరలు, పంటలకు మద్దతు ధరలను నిర్ణయించడం చూస్తుంటే వ్యవసాయ రంగంపై వారికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతున్నది. అంతేకాకుండా ప్రభుత్వాలు దశాబ్దాల నుంచి ఎరువులపై కొనసాగించిన రాయితీ విధానాన్ని తుంగలో తొక్కుతూ సేంద్రియ సాగును ప్రోత్సహించే 'పీఎం ప్రణామ్' సాకుతో ఈ ఆర్థిక సంవత్సరం ఎరువుల సబ్సిడీకి కేంద్రం 22.25 శాతం కోత పెట్టింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎరువులపై సబ్సిడీ రూ.2.54 లక్షల కోట్లు ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరం 2023-2024 ఆర్థిక సంవత్సరంలో రైతులకు ఎరువులపై ఇస్తున్న రాయితీని రూ.1.75 లక్షల కోట్లకు తగ్గిస్తున్నట్టు ఆర్థికమంత్రి సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్ సమావేశంలో తెలిపారు. ఈ విధంగా కేంద్ర ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీని తగ్గిస్తుండటంతో అకస్మాత్తుగా ఎరువుల ధరలు భారీగా పెరిగి అంతంత మాత్రంగా ఉన్న రైతుల భారం పడుతున్నది.

**రైతాంగానికి తీవ్ర నష్టం:** ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల ఇప్పటికే తీవ్ర నష్టాల్లో ఉన్న రైతులకు పెరిగిన ఎరువుల ధరలు వారి ఆర్థిక స్తోమతను కుంగదీస్తున్నాయి. ఈ ఏడాది నామమాత్రంగా పెంచిన మద్దతు ధరలు, ఎడాపెడా పెరుగుతున్న ఎరువుల ధరలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మన తెలంగాణలో వరితో పాటు పత్తి పంటలు అధికంగా సాగవుతాయి. పంటలకు పోషకాలు అందించేందుకు రైతులు ఎక్కువగా ఎరువులపైనే ఆధారపడుతుంటారు. అయితే ఏటా ఎరువుల ధరలు అందనంత ఎత్తుకు పెరుగుతుండటం, తెలంగాణలోని చిన్న, సన్నకారు రైతులే ఎక్కువగా ఉండటంతో వారు సాగుకే దూరంగా ఉండటం మంచిదనే అభిప్రాయానికి వస్తున్నారు. కరోనాకు ముందు 50 కిలోల పొటాష్ ధర రూ.970 ఉండగా నేడు అది రూ.1550కి చేరడం అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 5 శాతం జీఎస్టీని విధించడంతో ఒక్కో బస్తాకు దాని ధరను బట్టి 80- 120 రూపాయల అదనపు భారం పడుతున్నది. ఎరువులపై జీఎస్టీ విధానం పట్ల రైతులు కేంద్ర ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం ధరలు పెంచడంతో వ్యాపారులు సిండికేట్ అయి, మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. దీంతో గతంలో ఎరువులు దొరక్క మధ్యప్రదేశ్, యూపీ తదితర రాష్ర్టాల్లో లైన్లలోనే నిలబడి రైతన్నలు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం జరిగాయి.

కార్పొరేట్ల పక్షాన నిలుస్తున్న కేంద్రం.. భూమినే నమ్ముకున్న అన్నదాతపై ఎరువుల భారాన్ని మోపడం చూస్తుంటే వారి ప్రేమ ఎవరి మీద అనేది క్షుణ్ణంగా అర్థమవుతున్నది. కార్పొరేట్లతో చేసే సహవాసం వారికి అధిక లాభాలను చేకూర్చవచ్చేమో కానీ, వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించక తప్పదు.

> వ్యవసాయ పంటల మద్దతు ధర కోసం 2004లో ఏర్పాటు చేసిన ఎం.ఎస్.స్వామినాథన్ కమిటీ 6 దశలుగా నివేదిక సమర్పించింది. సాగు వ్యయం కన్నా 50 శాతం అదనంగా గిట్టుబాటు ధరను ఇవ్వాలని సూచించింది. దానికి అనుగుణంగానే మద్దతు ధరలను కల్పిస్తున్నామన్న కేంద్రం.. మూలధన వ్యయాన్ని, భూమి కౌలు వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదు. అంతేకాకుండా మద్దతు ధర ఇచ్చి పంటల కొనుగోలుకు కేంద్రం విశ్వసనీయ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడంతో గిట్టుబాటు ధర రైతులకు అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నది.

ఎరువుల ధరలను పెంచడం మూలాన రైతులకు తీరని నష్టం వాటిల్లుతున్నది. ఎరువుల ధరలను చిన్న, సన్నకారు రైతులకు అందుబాటు ధరలోకి తీసుకువచ్చి, జీఎస్టీ సుంకాన్ని రద్దుచేసి అన్న'దాత'పై అదనపు భారాన్ని మోపకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రానిదే. ఎరువుల ముడిసరుకులపై అంతర్జాతీయ మార్కెట్లో పెరిగిన ధరలను కేంద్రమే భరించి.. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఎరువుల సబ్సిడీ విధానాన్ని రైతుల సంక్షేమం దృష్ట్యా కొనసాగించాలి. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కేంద్రం తీసుకొచ్చిన ప్రణామ్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. అంతే తప్ప దాన్ని సాకుగా చూపి ఎరువులపై సబ్సిడీని వెనక్కి తీసుకోవడం సరైన చర్య కాదు. అడ్డూఅదుపు లేకుండా పెరుగుతున్న ఇంధన ధరల వల్ల రైతులపై భారీగా భారం పడుతున్నది. వాటి ధరలను నియంత్రించాలి. లోపభూయిష్టంగా ఉన్న మద్దతు ధర విధానం అమలుతో పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగేలా చేస్తున్నది. దీనిపై ఒక విశ్వసనీయ వ్యవస్థను ఏర్పాటుచేయాలి. అప్పుడే రైతుల ఆశలు తిరిగి చిగురిస్తాయి.

**(వ్యాసకర్త: కేయూ విద్యార్థి)**



బూడిద బిక్షమయ్య గౌడ్

# ఏడు నెలల్లోనే దశాబ్దం వెనక్కి

**తెలంగాణలో ఎక్కడ చూసినా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలే దర్శనమిస్తున్నాయి. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులతో పాటు వివిధ వర్గాల ప్రజలు తమ తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కుతున్నారు.**

ప్రజాపాలన అని గప్పాలు కొట్టే కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్యుల సమస్యలను పట్టించుకోవడం లేదు. పైగా నిరసనలు చేస్తున్నవారిని ఇష్టారీతిన దుర్భాషలాడుతూ అక్రమ కేసులు పెడుతున్నది. రాజధాని హైదరాబాద్ హత్యలతో అట్టుడుకుతున్నది. శాంతిభద్రతలు కరవవడంతో రాష్ట్ర ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కరెంట్ కోతలు ఎక్కువయ్యాయి. ఫలితంగా తెలంగాణలోని పరిశ్రమలు తరలిపోతున్నాయి. దాంతో ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయి. అసలు ఏం జరుగుతున్నది మన తెలంగాణలో? ఎట్లుండే తెలంగాణ ఎట్లయింది.

మోసపూరిత హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఏ ప్రభుత్వమైనా కొత్తగా అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళ్తుంది. కానీ, రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నది. ఒక్క సంక్షేమ పథకాలే కాదు, సాగు, తాగు నీరు, పరిశ్రమలు, రియల్ ఎస్టేట్, కరెంట్, శాంతిభద్రతలు, ఉద్యోగాల కల్పన, విద్య, వైద్య వ్యవస్థ.. ఇలా ఒక్కటేమిటి అన్ని రంగాల్లో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ఈ కారణంగా కొట్లాడి సాధించుకున్న తెలంగాణ ఏడు నెలల కాంగ్రెస్ పాలనలో ఎంతో వెనక్కి వెళ్లింది.




మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ, అధికారంలోకి వచ్చి 7 నెలలైనా ఇప్పటివరకు ఒక్కటంటే ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేకపోయింది. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి తామే కొలువులు భర్తీ చేశామని గొప్పగా ప్రచారం చేసుకున్నది. వారికి కూడా నాలుగు నెలలుగా జీతాలు లేవు. జీతాల కోసం సీఎం ఇంటి ముందు ధర్నా చేసే పరిస్థితి వచ్చింది. డీఎస్సీ వాయిదా వేయాలని, 1:100 ప్రాతిపదికన గ్రూప్-1 అభ్యర్థులను ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు నిరసనలు, నిరాహార దీక్షలు చేస్తున్నారు. అయినా కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదు. పైగా నిరసనలు చేస్తున్న నిరుద్యోగ యువతపై అక్రమ కేసులు పెడుతున్నది. కేసీఆర్ హయాంలో ఉన్న ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ నేడు ప్రభుత్వ పెద్దలకు ఫ్రెండ్లీగా మారిపోయింది. నిరసనలను అణచివేస్తూ, అక్రమ కేసులు పెడుతూ, యువతను దుర్భాషలాడుతూ నేడు అదే పోలీస్ వ్యవస్థ తమ లాఠీలకు పని చెప్తున్నది. అంతేకాదు, మీడియా ప్రతినిధులపై కూడా కేసులు పెడుతుండటం దారుణం.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఉస్మానియా యూనివర్సిటీ మళ్లీ ఖాకీ వలయంగా మారుతుందని, ప్రత్యేక బలగాలు ఓయూ చుట్టూ మోహరిస్తారని ఎవరూ ఊహించి ఉండరు. కానీ, కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలలకే 2014కు ముందు పరిస్థితులు ఓయూలో సాక్షాత్కారమయ్యాయి. విద్యార్థులతో కోలాహలంగా ఉండే వర్సిటీ పోలీసుల పహారాలోకి వెళ్లిపోయింది. ఎక్కడ, ఎవరూ కనిపించినా వారిని ఠాణాలకు తరలిస్తున్నారు. ఆందోళనకారులపై ఏకంగా దాడులకు తెగబడుతున్నారు. మీడియా ప్రతినిధులను కాలర్ పట్టుకుని లాక్కెళ్లి పోలీస్ జీపులో పడేస్తున్నారు. దోషుల వలె జర్నలిస్టులను హింసిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వంలో చలనం రావడం లేదు. పరీక్షలు వాయిదా వేస్తారా, వేయరా? అన్నది ప్రభుత్వం ఇష్టం. కానీ, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలపడం నిరుద్యోగుల హక్కు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగులను పట్టించుకోలేదని కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే పెద్దపెద్ద ఉపన్యాసాలు ఇచ్చారు. ప్రియాంకాగాంధీ చేతులమీదుగా యూత్ డిక్లరేషన్ కూడా ప్రకటించారు. రాహుల్, ఖర్గే కాంగ్రెస్ మేనిఫెస్టోతో పాటు జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించారు. రాహుల్‌గాంధీ స్వయంగా సెంట్రల్ లైబ్రరీకి వెళ్లి నిరుద్యోగులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఇప్పుడు ఆ హామీలన్ని నీటిమీద రాతలుగా మారాయి.

ఇప్పటికైనా రేవంత్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు స్వస్తి పలకాలి. పాలనపై దృష్టి సారించాలి. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితమైతే బాగుంటుంది. ఇది అందరి రాష్ట్రం. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రం. అనేక పోరాటాలు, త్యాగాలు బలిదానాలతో సాధించుకున్న రాష్ట్రం. పోరాడి సాధించుకున్న తెలంగాణ కేసీఆర్ నాయకత్వంలో గత పదేండ్ల పాటు అభివృద్ధి పథంలో దూసుకుపోయింది. కేసీఆర్ సర్కార్ వలె ప్రస్తుత ప్రభుత్వం కూడా అభివృద్ధిని పరుగులు పెట్టించాలి. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగించాలి. లేకపోతే కొట్లాడి సాధించుకున్న తెలంగాణ అందరి ముందు నవ్వుల పాలవుతుంది. రేవంత్‌కు పాలన అనుభవం లేదు. కనీసం సలహాదారులుగా అనుభవం ఉన్నవాళ్లను పెట్టుకొని తెలంగాణను ముందుకు తీసుకెళ్లాలి.

**(వ్యాసకర్త: ఆలేరు మాజీ ఎమ్మెల్యే)**





## డిగ్రీలెందుకు.. పంక్చర్ షాపులు తెరవండి!

*మీరు చదివే డిగ్రీలు దండుగ. వాటితో భవిష్యత్తులో ఎలాంటి ప్రయోజనం ఉండదు. అందుకే మీకో సలహా ఇవ్వాలనుకుంటున్నా. డిగ్రీలు చదివే బదులుగా మోటార్‌సైకిల్ పంక్చర్ రిపేర్ షాపులను తెరవండి. అవే మీకు జీవనోపాధి మార్గాన్ని చూపిస్తాయి.*



**- పన్నాలాల్,** మధ్యప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే



# అనారోగ్య బదిలీలు



యెనుగందుల శంకర్

వైద్యారోగ్యశాఖలో బదిలీలు గందరగోళంగా తయారయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 80 సాధారణ బదిలీలపై నిషేధం ఎత్తివేసింది. ఈ నిషేధం జూలై 21వ తేదీ వరకు కొనసాగుతుంది. దీంతో వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వైద్యారోగ్యశాఖ ప్రత్యేకమైన బదిలీల కోసం జీవో 209ను జారీ చేసింది. సివిల్ సర్జన్లు, డిప్యూటీ సివిల్ సర్జన్లు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ తదితర సిబ్బంది బదిలీల కోసం ఈ జీవో జారీ చేసింది. కానీ, ఆ జీవోలో 4 ఏండ్ల లోపు ఉన్నవారు బదిలీ కావలసిన అవసరం లేదని, నాలుగేండ్లు దాటిన వారే తప్పనిసరిగా బదిలీ కావాలని తెలియజేస్తూ మళ్లీ 40 శాతం మాత్రమే బదిలీ చేస్తామని చెప్పడం హాస్యాస్పదం.

ఇందులో బహుళార్థసాధక ఆరోగ్య కార్యకర్తలు అత్యధికంగా నష్టపోతున్నారు. వారికి వెకెన్సీ లిస్ట్‌లో క్లియర్ వెకెన్సీ పేరుతో ఈసీ ఏఎన్ఎం ఉన్న ఉపకేంద్రాలన్నీ క్లియర్ వెకెన్సీగా చూపిస్తూ నాలుగేండ్ల పైబడిన వారందరినీ సాధారణ వెకెన్సీగా చూపిస్తూ ఒక లిస్టు వచ్చింది. ఆ లిస్టుతో అందరికీ ఆందోళన మొదలైంది. ఎందుకంటే నాలుగేండ్లు పైబడిన వారందరూ ఆప్షన్లు పెట్టుకోవాలా లేదా వెకెన్సీ లిస్ట్ ఏదైతే ఉందో ఆ లిస్ట్ ఎంత ఉందో అంతవరకు కటాఫ్ ఉన్న 40 శాతం మంది మాత్రమే ఆప్షన్లు పెట్టుకోవాలా అనే సందేహం వారిలో ఉన్నది. అయితే ఆ సందేహాన్ని నివృత్తి చేయగల అధికారులు లేరు. హడావుడిగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌లో ఒక గ్రీవెన్స్ సెల్ ప్రారంభించి ఆ గ్రీవెన్స్ ఒకరోజు మాత్రమే సమయం ఇచ్చి జూలై 11 సాయంత్రం 5 గంటల లోపు మీకు ఎలాంటి సందేహాలున్నా నేరుగా ఫిర్యాదు చేయండని తెలిపారు. అయితే ఇంతవరకు కొన్ని క్యాడర్ల వెకెన్సీ లిస్ట్ కానీ, అర్హత గల వారి లిస్ట్ గాని పెట్టలేదు. అంటే లిస్టు 11న ఉదయం వస్తే సాయంత్రం 5 గంటల లోపు హైదరాబాద్‌లో గల డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయానికి ఎలా చేరుకుని ఫిర్యాదు చేస్తారో ఒకసారి అధికారులు ఆలోచించాలి. అంతేకాకుండా జూలై 12వ తేదీ సాయంత్రం 5 గంటల లోపే ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఇచ్చారు. లిస్ట్ 11న ఉదయం పెట్టి జూలై 12న సాయంత్రం 5 గంటల లోపు ఆప్షన్లు పెట్టుకోవాలనడం విడ్డూరం. ఎందుకంటే వారికి కనీసం ఆలోచించుకునే సమయం కూడా ఇవ్వకుండా హడావుడిగా బదిలీలు చేయడం సరైంది కాదు. దీనివల్ల తర్వాత ఎన్నో ఆర్థిక లావాదేవీలతో అక్రమాలు జరిగే అవకాశాలున్నాయి. కాబట్టి ప్రభుత్వం గమనించి వెకెన్సీ లిస్ట్, బదిలీలకు అర్హత గల ఉద్యోగుల లిస్టు ఆలస్యమైనా ఆప్షన్లు పెట్టుకోవడానికి సమయం ఇవ్వాల్సిన అవసరం ఉన్నది.

వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు సరైన గైడ్‌లైన్స్ ఇచ్చి గ్రీవెన్స్ జిల్లా స్థాయిలోనే ఏర్పాటుచేస్తే బాగుంటుంది. రాష్ట్రం మొత్తానికి ఒకే గ్రీవెన్స్, అది కూడా ఒకరోజు మాత్రమే ఏర్పాటుచేయడం వలన గందరగోళ పరిస్థితి ఏర్పడుతున్నది. వెకెన్సీ లిస్ట్ కూడా ఒక్కో జోన్‌కు ఒక్కోరకంగా ఇస్తున్నారు. అంటే జోన్‌లో నాలుగేండ్లు దాటిన అందరి స్థానాలను వెకెన్సీ లిస్టులో సూచించారు. కొన్ని జోన్లలో 40 శాతం మాత్రమే వెకెన్సీ దిశలో చూపించారు. ఇది సరైంది కాదు. జూలై 11న వెలువడిన ఆరోగ్య విస్తరణాధికారుల సీనియారిటీ జాబితా తప్పుల తడకగా మారింది. ఎందుకంటే పన్నెండేండ్ల సీనియారిటీ ఉన్న వ్యక్తుల పేర్లు లేకపోవడం ఆశ్చర్యకరం, సీనియారిటీ క్రమంలో పేర్లు లేకపోవడం ఇంకా విచిత్రం. రెండేండ్లు మాత్రమే సీనియారిటీ గల వ్యక్తుల పేర్లు ఉండటం మరీ విచిత్రం. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో బదిలీలు చేపడుతూ ఉద్యోగులకు చుక్కలు చూపిస్తున్నది.

**(వ్యాసకర్త: ఆరోగ్య విస్తరణాధికారి)**